చిత్ర మాసపత్రిక క్రైం కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ

# జారుడు మెట్లు



**బ్యాం**క్ లాకర్ రూంలోకి కస్టమర్‌తో బాటు వెళ్ళాడు అసిస్టెంట్ మేనేజర్ కుమార్.

అతడు మాస్టర్ 'కీ' నీ కస్టమర్ తన 'కీ' నీ లాకర్ తాళపు కన్నాల్లో పెట్టి ఒకేసారి తిప్పారు. లాకర్ ఓపెనయ్యింది. తన కీ ని తీసేసి "మీ లాకర్ పని అయ్యాక మీ కీ తో లాక్ చేసెయ్యండి" అని చెప్పి వచ్చేశాడు కుమార్.

తన సీట్లో కూర్చున్నాడో లేదో దున్నపోతుల్లాంటి ఇద్దరు బ్యాంక్ హాల్లోకి రావటం కన్పించింది. అతడి మొఖంలోని రక్తమంతా ఒక్కసారిగా ఇంకిపోయింది. నోటి తడారి పోయింది. కలవరపడ్తూ బాత్‌రూంలోకి పారిపోవాలని చూశాడు గాని వారి చూపులతడి కాళ్ళకు బంధం వేసాయి.

వాళ్ళు సమీపించారు. వెర్రిగా నవ్వేడు. వాళ్ళు క్రూర చూపుల్తో చిత్రవధ చేశారు. క్షణాల్లో ఒళ్ళంతా కుళ్ళబొడిచినట్టుగా అయిపోయాడు కుమార్.

"డబ్బెక్కడ?" గద్దించాడొకడు

"ఆ ప్రయత్నంలోనే ఉన్నాను. ఎలాగైనా ఇచ్చేస్తాను. ప్లీజ్..... రెండే రెండ్రోజులు గడువివ్వండి...." వాళ్ళ చేతులు పట్టుకున్నాడు. లేకపోతే అందరూ చూస్తూండగా అవి తన కాలర్ని పట్టుకుని గుంజుతాయేమోనని అతడి భయం!

"సరే. లాస్ట్ టూ డేస్. చెల్లించలేదో నీకు అదే లాస్ట్ డే అవుతుంది"

బెదిరించి వెళ్ళిపోయారు. ఎవరైనా తమని గమనించారేమోనని కలవరపడ్తూ చుట్టూ చూశాడు. బ్యాంకులో రద్దీగా ఉండటంతో ఎవరి పనుల్లో వారున్నారు. గాఢంగా నిట్టూర్చాడు.

విచ్చలవిడిగా క్రెడిట్ కార్డ్ వాడేశాడు. అది వడ్డీతో కలిసి డబ్బై వేలైకూర్చుంది. ఇప్పుడర్జంటుగా అంత సొమ్ము కక్కాలి. ఎలా? తనకి అప్పివ్వగల వాడెవడూ మిగల్లేదు. అందరి దగ్గరా అప్పులు చేసేశాడు. ఒకటి పూడ్చాలంటే ఇంకోటి తవ్వాలి. ఇన్నాళ్ళూ అదే చేస్తూ వచ్చాడు. ఇప్పుడు దారులన్నీ మూసుకుపోయాయి.

సెల్ మ్రోగింది. వనజ. 'ఇదంతా నీ వల్లే వచ్చింది' అని మనసులో తిట్టుకుంటూ, "హలో" అన్నాడు.

"ఏం జేశారు?"

"ట్రై చేస్తున్నా..."

"మీరలా చేస్తూనే వుండండి. ఈలోగా పుణ్యకాలం అయిపోతుంది. మూడు లక్షలకి ఫ్లాట్ వస్తోంటే అలా మీనమేషాలు లెక్కపెడతారేంటి. నాకోసం ఆ మాత్రం చెయ్యలేరూ?"

'చెయ్యక ఛస్తానా' అని లోపలనుకుని, "చేస్తాను. చేసేస్తాను. జస్ట్ టూ డేస్ ఓపిక పట్టు" అని లైన్ కట్ చేసి నుదుటికి పట్టిన చెమట తుడుచుకున్నాడు.

వనజ అతడి భార్య కాదు. భార్యలాటిది. అరేబియా గుర్రంలా ఉంటుంది. చిన్న ఉద్యోగం చేస్తోంది. ఒంటి మీదకి ముప్పై రెండేళ్ళొచ్చినా పెళ్లి కాలేదు. వల విసిరాడు. చేప పడింది. సెకండ్ సెటప్ పెట్టేశాడు.

ఆమె కోరికలు తీర్చడానికి క్రెడిట్ కార్డు వాడేడు. అప్పులూ చేశాడు. ఇప్పుడు చవగ్గా వస్తోందంటూ పాత ఫ్లాట్ కొని కానుకగా ఇమ్మని పీకల మీద కూర్చుంది.

'ఇప్పుడేవిటి చెయ్యడం?'

జుట్టు పీక్కొంటోంటే లాకర్ రూంలోకి వెళ్ళిన వాళ్ళు తిరిగొచ్చి లాకర్ రిజిస్టర్లో సంతకం పెట్టి వెళ్ళిపోయారు.

"నాకు అర్జంటుగా లాకర్ కావాలండీ" ఒక పెద్దాయన వచ్చి అడిగాడు.

"ఏం ఖాళీలేవు" విసుక్కున్నాడు.

"నేను మీ బ్యాంకు కస్టమర్నండీ. మూడు లక్షలు ఫిక్సెడ్ డిపాజిట్‌లో ఉన్నాయి....." రసీదులు బయటికి తీస్తూ అన్నాడు.

నిటారుగా అయ్యాడు కుమార్.

"మా అబ్బాయి దగ్గరకి అమెరికా వెళ్తున్నాం. ఆర్నెల్ల దాకా రాము. ఇంట్లో చాలా బంగారం వుంది. వడ్డాణమూ వుంది. వాటిని ఇంట్లో దాచి వెళ్ళలేం కదండీ. మీరెలాగైనా నాకో లాకర్ ఇప్పించాలి" ప్రాధేయపడ్డాడు.

"అయితే మీకు పెద్ద లాకర్ కావాలి. అద్దె ఏడాదికి అయిదు వేలవుతుంది మరి. ఒక్కటే ఖాళీగా వుంది"

"అది నాకిప్పించండి. మీ ఋణం ఉంచుకోను"

"అంత మాటెందుకు లెండి గాని రండి..." అంటూ బ్రాంచి మేనేజర్ క్యాబిన్లోకి తీసుకెళ్ళాడు.

మేనేజర్ పరమానందానికి దగ్గర దగ్గర యాభై ఏళ్ళుంటాయి. ముక్కుకి సూటిగా పోతాడు. చాదస్తుడంటారు బ్యాంకులో.

"వీరు మన బ్యాంక్ ఇంపార్టెంట్ కస్టమర్. పెద్ద లాకర్ కావాలంటున్నారు....."

పరమానందం కుమార్ వంక సూటిగా చూసేసరికి తడబడ్డాడతడు.

ఆయన కుమార్ ప్రతి అడుగునీ అనుమానిస్తూంటారు.

ఆర్థిక క్రమశిక్షణ లేని ఉద్యోగులు ఎప్పుడో అప్పుడు కక్కుర్తి పడకుండా ఉండలేరని ఆయన నిశ్చితాభిప్రాయం. కుమార్ అప్పుల గురించీ, శాలరీ ఎటాచ్‌మెంట్ల గురించీ ఆయనకి బాగా తెలుసు మరి!

"వీరెవరో నాకు తెలీద్సార్. కస్టమర్ అని తీసుకొచ్చానంతే..."

తలపంకిస్తూ, "మీ పేరేవిటి?" అడిగారాయన.

"రామస్వామండి. నాకు లాకర్ చాలా అవసరం. అమెరికా వెళ్తున్నాను....." అంటూ ఫిక్సెడ్ డిపాజిట్ రసీదులు చూపించారు.

మరి కొన్ని ప్రశ్నలడిగాక, "వీరికి పెద్ద లాకర్ ఎలాట్ చెయ్" అన్నారాయన.

తేలిగ్గా నిశ్వసించి తన సీట్లో కొచ్చేశాడు కుమార్. వెనకే వచ్చిన రామస్వామి ఎంతో సంతోషపడిపోతూ కృతజ్ఞతలు తెలియజేశాడు.

"ఇందులో నేను చేసిందేముందీ. మా డ్యూటీ మేం చేశామంతే. ఇదిగో ఈ అగ్రిమెంటుని వందరూపాయల స్టాంపు పేపర్ మీద టైపు చేయించుకుని రేపు పట్రండి. నగలూ తెచ్చుకోండి. ఏకంగా లాకర్లో పెట్టేసుకుందురు గాని"

ఫారం తీసుకుని వెళ్ళి పోయాడాయన.

కుమార్ మెదడు పాదరసమయ్యింది.

మరి పదినిమిషాలకి లేచి వెళ్ళి ఒక లాకర్లో భద్రపరిచిన కొత్త తాళపు చెవుల పాకెట్‌ని బయటికి తీశాడు. తాళాలన్నీ ఒక్కోటీ ఒక చిన్న ప్లాస్టిక్ కవర్లో సీల్ చేసి ఉన్నాయి. వాటినలాగే సీల్‌తోనే కస్టమర్స్‌కివ్వాలి.

ఏ లాకర్‌కి ఏ కీ అన్న వివరాల కాన్ఫిడెన్షియల్ లిస్టు మేనేజర్ దగ్గరే ఉంటుంది. రెండ్రోజుల క్రితం కొత్త లాకర్ ఇస్తున్నప్పుడు పెద్ద లాకర్ కీ నెంబర్ దొంగచాటుగా చూశాడు. దానిని గుర్తు చేసుకుంటూ వెదకి పట్టుకున్నాడు. సీలు తీసి ఆ 'కీ'నీ మాస్టర్ కీ నీ పెద్ద లాకర్లో పెట్టి తిప్పాడు. తెరచుకుంది. పరమానందపడి పోయి తిరిగి క్లోజ్ చేసేసి, నుదుటి చెమటలు తుడుచుకున్నాడు.

ఆ లాకర్ తాలూకు కస్టమర్ కివ్వాల్సిన తాళపు చెవిని జేబులో వేసుకుని మిగతా తాళాల పాకెట్‌ని లోపల దాచేశాడు.

ఆరింటికి బ్యాంక్‌లోంచి బయటపడి బజార్లో కెళ్ళాడు.

తాళాలు బాగు చేసే వాడికి లాకర్ కీ ఇచ్చి డూప్లికేట్ తయారు చెయ్యమన్నాడు. అతడు ఎగా దిగా చూసి "తాళం కప్ప ఉండాలి" అన్నాడు.

"ఇది బీరువా లాకర్‌దయ్యా. నా వైఫ్‌కి ఒకటివ్వాలి. దీని ప్రకారం తయారు చెయ్యి చాలు. సరిపోకపోతే రేపొస్తాను. కరెక్టు చేద్దువు గాని" కసురుతున్నట్టు అన్నాడు.

అతడు తయారు చేస్తోంటే సిగరెట్టు కాలుస్తూ ఆ ప్రక్కనే నిలబడ్డాడు.

డూప్లికేట్ తాళపు చెవి రెడీ అయింది. డబ్బిచ్చేసి చిన్నగా ఈల వేస్తూ ఇంటికెళ్ళాడు.

"ఇంతక్రితమే ఇంటాయన వచ్చి కేకలేసి వెళ్ళాడు. అద్దె ఇచ్చి మూడ్నెల్లయ్యింది ఖాళీ చేసెయ్యమంటున్నాడు"

"ఏడ్చేడు. ఖాళీ చెయ్యం కోర్టుకి పొమ్మని చెప్పు"

ఆశ్చర్యంగా చూసింది భార్య. ఇంటర్ చదువుతోన్న కొడుకు క్రికెట్ బ్యాట్ పట్టుకునొచ్చాడు.

"వీడికి చదువుకన్నా క్రికెట్ ఎక్కువైపోయింది. నా మాట వినటం లేదు. మీరు కాస్త

కోప్పడండి”

“ఎవడికోసం చదువుతాడూ! వాడే చదువుకుంటాళ్ళే గాని వంటైతే వడ్డించు నాకు పని వుంది”

అతడి భావం ఆమెకి బోధపడింది. కళ్ళల్లో కన్నీటి పొర కదిలింది.

మౌనంగా భోజనం వడ్డించింది. “చేతిలో ఆఫీసర్ హెూదా ఉద్యోగం వుంది. అందర్లా గౌరవంగా బ్రతక్క అడ్డమైన తిరుగుళ్ళెందుకు చెప్పండి” మెల్లగానే చెప్పింది.

కయ్ మని కళ్ళు మూసుకుని పడ్డాడు.

“నోర్మూయ్. గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందిట. నువ్వు నాకు చెప్పేంత దానివయ్యావా?”

“అది కాదండీ....”

“షటప్. నా బాగేవిటో, అది ఎక్కడ ఎందులో ఉందో నాకు బాగా తెలుసులే. అనవసరంగా జోక్యం చేసుకోకు”

నిస్సహాయంగా చూస్తుండి పోయిందామె.

తినేసి డ్రెస్సప్ ఐ స్కూటర్ బయటికి తీశాడు. తిన్నగా వనజ రూం కెళ్ళాడు.

“ఇంకెన్నాళ్ళు నాకీ సింగిల్ గది రాత?”

“కొన్ని రోజులే. కొంచెం ఓపిక పట్టు. మన జాతకం మారిపోతుంది”

“నిజంగా?”

“యస్” అంటూ తన పథకం వివరించాడు.

“దొరికేస్తే?”

“ఛాన్సేలేదు. ఆర్నెల్లకి గాని బయటపడదు. అప్పటికి ట్రాన్స్ఫర్ మీద ఇంకో ఊళ్ళో ఉంటాం. నా మీద అనుమానం వచ్చే అవకాశమే లేదు” అన్నాడు ఆమెని కౌగిల్లోకి తీసుకుంటూ.

తనపేరన ఫ్లాట్ కొన్నాక ఇంక దేనికి టెండర్ పెట్టడమా అన్న ఆలోచనలో పడిందామె. ‘దీపం ఉండగానే ఇల్లు చక్క బెట్టుకోవాలి. మోజు ఉండగానే నాలుగు రాళ్ళు వెనకేసుకోవాలి’ అనుకుంది.

మర్నాడు కుమార్ డూప్లికేట్ కీ తో ప్రయత్నించాడు. లాకర్ ఓపెనయ్యింది. ఎగిరి గంతేశాడు. ఏమీ ఎరగనివాళ్ళా కూర్చుని పరమానందం కోసం ఆత్రంగా ఎదురు చూడసాగాడు.

పరమానందం రావటం, లాకర్ ఎలాట్ చెయ్యడం, కీ ఇవ్వడం, ఆయన అందులో నగలు భద్రపరచుకోవడం చకచకా జరిగిపోయాయి.

ఆనందోద్విగ్నుడై ఊగిపోతున్నాడు కుమార్. పని మీద దృష్టి నిలవట్లేదు. కాలు

గాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

బ్యాంకు కొస్తూ తెచ్చిన కొత్త స్కూల్ బ్యాగ్ డ్రాయర్ సొరుగులో వుంది. దాన్ని తీసుకుని లాకర్ రూంలో కెళ్ళాలని ప్రయత్నిస్తున్నాడు. అంతలోనే ఎవరైనా గమనిస్తారేమోనని భయపడ్తూ వెనుకంజ వేస్తున్నాడు.

అయిదారుగురొచ్చి మేనేజర్ క్యాబిన్లో కెళ్ళారు. వాళ్ళున్నంతసేపూ మేనేజర్ క్యాబిన్ దాటి బయటికి రాడు.

ఇదే అదననుకుని లాకర్ రూంలో కెళ్ళి డోర్ వేసుకున్నాడు.

డూప్లికేట్ కీ మరియు తన దగ్గరున్న బ్యాంక్ మాస్టర్ కీతో పెద్ద లాకర్ తెరిచాడు. అందులోని నగల్ని బ్యాగ్‌లో వేసుకున్నాడు. లాకర్ డోర్ దగ్గరకి నొక్కి తన మాస్టర్‌కీ తీసుకుని వచ్చి బ్యాగ్‌ని తన డ్రాయర్లో దాచేసాడు.

ముచ్చెమటలు ధారలుగా కారి పోతున్నా తుడుచుకోకుండా నలుదిశలా పరికించాడు. ఎవరూ తనని గమనించినట్టు లేరు.

పని ఇంత సులభంగా అవుతుందనుకోలేదు. వెర్రి సంబరంగా ఉందతడికి.

సిటీ కెళ్ళి ఈ నగల్ని అయిదారు దుకాణాల్లో అమ్మేస్తే చాలు...... వనజ పేరన ఫ్లాట్ రిజిస్టరవుతుంది. క్రెడిట్ కార్డ్ అప్పు, చిన్న బాకీలూ తీరిపోతాయ్. బంగారం ఎక్కువే ఉంది. బాకీలన్నీ తీరినా తీరొచ్చు. అతగాడు నోట్ల కట్టలు కూడా లాకర్లో దాచి ఉండి ఉంటే ఎంత బావుండేది.....!

“కుమార్! ఎవరో లాకర్ కీని లాకర్‌కే వదిలేసారు....” బిగ్గరగా అరిచాడు సబ్ మేనేజర్ లాకర్ రూంలోంచొస్తూ.

కుమార్ నవనాడులూ క్రుంగిపోయాయి. కంగార్లో డూప్లికేట్ కీని లాకర్నుంచి తీయడం మర్చిపోయాడు. మాస్టర్ కీ గురించి తప్ప కస్టమర్ కీ గురించి తను పట్టించుకోడు. ఇప్పుడూ అలాగే చేసి.....! అలవాట్లో పెద్ద పొరబాటు!

నారి సంధించి వదిలిన బాణంలా లాకర్ రూంలోకి దూసుకెళ్ళాడు కుమార్.

పెద్ద లాకర్ కన్నంలో వెక్కిరిస్తూ డూప్లికేట్ కీ !

“అరె. ఇది ఒరిజినల్ కాదు... డోంట్ టచిట్. ఏదో జరిగింది. బయటికొచ్చెయ్.... మేనేజర్‌కి రిపోర్టు చేద్దాం...”

నిలువునా వణకి పోతున్నాడు కుమార్. మెదడు మొద్దు బారిపోయింది.

సంగతి వింటూనే కుమార్ వంక మాడ్చేసాలా చూస్తూ లాకర్ రూంలో కొచ్చారు మేనేజర్. కర్చీఫ్ కప్పి తాళం చెవి తీసి పరిశీలించారు. ఆ పైన తల పంకించారు.

మేనేజర్ క్యాబిన్లో ఆయన కెదురుగా కుమార్ కూర్చునున్నాడు. బలికి సిద్ధమైన వాడిలా వున్నాడు.

“మైగాడ్! ఇవాళ ఎలాట్ చేసిన లాకర్‌కి డూప్లికేట్ కీ.....! నగల్నేం చేశావ్?” నిల

దీశారు.

బుకాయించాలనుకున్నాడు. కాని నోరు పెగల్లేదు. "చెబుతావా పోలీసుల్ని పిలవనా?"

"అన్నీ ఇచ్చేస్తాను సార్..... నన్ను క్షమించండి..." ఏడ్చేశాడు.

"అసహ్యంగా ఏడవకు. నడు. తీసిన నగల్ని తీసినట్టు పెట్టెయ్. ఒక్కటీ తేడా రాకూడదు... నీ వల్ల బ్యాంకు పరువు పోయేట్టుందిరా ఇడియట్"

ఆయన స్వర తీవ్రతకి కంపించి పోతూ తలూపాడు.

ముందు అతడూ, వెనుక ఆయనా స్కూల్ బ్యాగ్‌తో లాకర్ రూంలోకెళ్ళి నగల్ని యథాతథంగా లాకర్లో పెట్టేసి లాక్ చేసారు.

డూప్లికేట్ కీ, బ్యాంక్ మాస్టర్ కీ రెండూ తీసేసుకుని "కమాన్" అన్నారు.

ఏం జరుగుతోందో అర్థంగాక అయోమయంగా చూస్తున్నారు బ్యాంక్ స్టాఫ్.

ఒక కాగితం ఇచ్చి "జరిగిందంతా రాసివ్వు" అన్నారు మేనేజర్.

"నా ఉద్యోగం పోతుంది సార్. ప్లీజ్ కనికరించండి. పిల్లలు కలవాడ్ని..." ఆయన కాళ్ళ మీద పడాలని ప్రయత్నిస్తూ అన్నాడు కుమార్.

"ఆ ఇంగితం దొంగతనం చేసే ముందుండాలి. ఇప్పుడు కాదు. ఇంటెగ్రిటీ లేని వాళ్ళకి బ్యాంకులో చోటుండదు. కమాన్. సిట్ అండ్ రైట్..." కళ్ళెర్ర జేస్తూ కటువుగా అన్నారు.

అదిరిపడ్డాడు కుమార్. అంత కఠినంగా ఆయన ఎప్పుడూ మాట్లాడలేదు. దుఖం తన్నుకొస్తోంటే రెండు ముక్కలు రాసి, ఒంటేలు చూపి, బాత్‌రూంలోకి పరుగున వెళ్ళాడు.

డోర్ లాక్ చేసి వనజకి ఫోన్ చేశాడు. "జాగ్రత్తగా విను. సిద్దార్థ కాన్వెంటుకెళ్ళి మా మేనేజరు గారి అబ్బాయినీ అమ్మాయినీ తీసుకొచ్చి నీ రూంలో బంధించు...."

"ఏం.... ఏం జరిగింది?"

"ష్.... ప్రశ్నలు తర్వాత. చెప్పేది విను. తర్వాత మేనేజరుకి ఫోన్ చేసి నాకు ఏమైనా జరిగినా, పోలీసు రిపోర్టిచ్చినా పిల్లలు బ్రతకరని హెచ్చరించు. కమాన్ హర్రీయప్..."

బాత్ రూం నుంచి తిరిగి రావడం ఆలస్యమయ్యేసరికి అతడే అఘాయిత్యానికి పూనుకున్నాడో అని ఆందోళనపడ్డాడు మేనేజర్.

తాపీగా వచ్చి కూర్చున్న కుమార్‌ని చూసి అమితాశ్చర్య బోయారు.

'ఇతడి ధీమా ఏమిటి? రెడ్ హ్యాండెడ్‌గా దొరికేసినా ఎవరో వచ్చి రక్షిస్తారను కుంటున్నాడా? ఇలాటి వాడ్ని బ్యాంకులో క్షణం కూడా ఉండ నివ్వకూడదు. హెడ్డాఫీసుతో మాట్లాడి వెంటనే సస్పెండ్ చేయించాలి. మై గుడ్నెస్! ఎంత దారుణానికి ఒడిగట్టాడూ!' అనుకుంటున్నారు పరమానందం.

కుమార్ నెమ్మదిగా రాస్తున్నాడు. దిద్దుతున్నాడు. మళ్ళీ రాస్తున్నాడు.

"త్వరగా రాయి..."

"రాస్తున్నాన్సార్"

పది నిమిషాలు గడిచాయి గాని అతడి రాత పూర్తవ్వలేదు. కోపంతో ఊగిపోతూ పేపర్ లాక్కుని చూశారు. ఏవో పిచ్చి రాతలు తప్ప నేరాంగీకార పత్రం కానే కాదు!

"నేన్చెప్పిందేవిటి? నువ్వు రాస్తోందేమిటి?"

అతడు చిన్నగా నవ్వాడు. ఆయన మరింతగా మండిపోతూ ఏదో అనబోతోంటే ఫోన్ మ్రోగింది. అవతలి మాటలు వింటూనే ఆయన మొఖం పాలిపోయింది. నీరసంగా కూలబడ్డారు మేనేజర్.

"నా పిల్లల్నేం చెయ్యకు... వాళ్ళు పసివాళ్ళు. లేక లేక పుట్టిన కవలలు....."

"మరైతే ఇదంతా మర్చిపోండి" అన్నాడు కుమార్.

నిస్సహాయంగా చూశారాయన. ఆయన చేతిలోని పేపరందుకుని చించేశాడు. చొరవగా ఆయన టేబుల్ సొరుగులాగి డూప్లికేట్ తాళం చెవి తీసుకుని బయటికి నడిచాడు.

ఎంతో హాయిగా వుంది. మాడిన అట్టులా అయిన మేనేజర్ మొహం తలచుకుని కసిగా నవ్వుకున్నాడు.

తిన్నగా వనజ రూం కెళ్ళాడు. గది బయట ఆందోళనగా తిరుగుతోందామె.

"వాళ్ళు పిల్లలు కాదు పిల్లరాక్షసులు. వారి గొడవ భరించ లేక నిద్రమాత్రలు మ్రింగించాను.... ఏం కాదు కదా?"

బెంబేలు పడ్డాడు. "ఎన్ని?"

మూడు వేళ్ళు చూపింది.

"ఏడేళ్ళ పిల్లలకి......"

లోపలికెళ్ళాడు. మత్తుగా పడి ఉన్నారు. నాడి పట్టుకుని చూశాడు. ఒకరి ఒళ్ళు చల్లగా తగిలింది. పాముని పట్టుకున్నట్టు గబుక్కున వదిలేశాడు.

"ఆటోని పిలు. క్విక్..."

పిల్లల్నిద్దర్నీ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళాడు. తన పిల్లలేననీ ఏదో మ్రింగేరనీ చెప్పేడు. తన పేరు తప్పు చెప్పాడు. పిల్లల్ని ఎమర్జన్సీ వార్డులోకి తీసుకెళ్తూ పదివేలు డిపాజిట్ చెయ్యమన్నారు. ఏటీయం నుంచి తెస్తానని చెప్పి అక్కడ్నుంచి మాయమైపోయి తిన్నగా వనజ రూం కెళ్ళాడు.

"వాళ్ళకి బాగానే వుంది కదా? వాళ్ళకేమైనా అయితే నా మెడకి చుట్టుకుంటుంది" వణకుతూ అంది.

"ఏంకాదు. నేనున్నాగా"

ఇంతలో సెల్ మ్రోగింది.

"నా బిడ్డలింకా ఇంటికి రాలేదురా దౌర్భాగ్యుడా. వెంటనే వదులు లేదంటే పోలీసులకి రిపోర్టు చేస్తాను" మేనేజరన్నారు ఆవేదన పడ్తూ.

గబగబా ఆలోచించాడు. క్షణకాలమే.

"ఊరి చివర కొండ దిగువున ఉన్న పెద్ద బండ వెనుక ఉన్నారు. విడిపించుకో. వాళ్ళు క్షేమంగా ఉన్నారు. తెలివైన వాడివి కదా. పోలీసులకి చెప్పి కొరివితో తలగోక్కోకు..."

లైన్ కట్ చేసి నవ్వాడు కుమార్.

"ఆసుపత్రిలో ఉన్నారని నిజం చెప్పక పోయావా?" వనజ అంది.

"చెబితే మనిద్దరం జైల్లో ఏడవాలి. జరిగిందంతా తెలిసింది ఆయనొక్కడికే. ఆయన్ని పైలోకాలకి పంపించామంటే ఆధారాలన్నీ మాయమైపోతాయి. మన చేతికి మట్టి అంటదు....."

అతడు ధీమాగా చెప్పాడు. భయ విహ్వలయై చూసిందామె. అతడు మనిషిలా కన్పించలేదు!

"రా... బండలే మన ఆయుధం..."

"నువ్వెళ్ళు. వెనకొస్తాను....."

"అదీ మంచిదే. ఎవరికీ అనుమానం రాదు"

కుమార్ కొండ దగ్గర బండ చాటున నక్కి మేనేజర్ కోసం ఎదురు చూస్తున్నాడు. దూరాన మారుతి ఆగింది. అందులోంచి మేనేజర్ దిగి గబ గబా రాసాగారు.

పెద్ద రాయిని సిద్ధం చేసుకుని సిద్ధంగా ఉన్నాడు కుమార్.

ఇంతలో వెనకాల అలికిడయ్యింది. తల తిప్పిచూశాడు.

పోలీసులు! వారి వెనుక భార్య!

"నువ్వా దౌర్భాగ్యురాలా?!" అరిచాడు. పోలీసులు లేకపోయి ఉంటే రాయిని ఆమె మీదకి విసిరేవాడే.

"సమయానికి వనజ ఉప్పు అందించబట్టి మీరు హంతకుడు కాకుండా కాపాడాను. ఎక్కడ్నుంచి ఎక్కడికి జారిపడ్డారు! ఏం బావుకున్నారు చెప్పండి?"

గుండె పట్టినట్టు కాగా పిచ్చిగా చూసాడు.

చక్కని కుటుంబ జీవనం కాదనుకుని అక్రమ సంబంధంలోకి జారి, అక్కడ్నుంచి అప్పుల ఊబిలోకి, దాని నుంచి దొంగతనానికి, అక్కడ్నుంచి కిడ్నాప్‌లోకి, అందులోంచి మళ్ళీ హత్యా ప్రయత్నానికి... తన పతన ప్రయాణం!

దుఃఖం పొంగివచ్చింది. పోలీసులు చేతులకు బేడీలు వేస్తోంటే భార్యవంక కన్నీటి పొరలోంచి కృతజ్ఞతగా చూశాడు కుమార్ – 'ఉరి' నుంచి రక్షించినందుకు!

**(చిత్ర మాసపత్రిక, మార్చి 2011)**